# వదిన ✝

రచన :
శ్రీ. సత్యం చౌదరి.

ప్రయాణికుల కష్టసుఖాలతో తనకేమీ జోక్యంలేనటు హాయిగా బొగ్గునములుతూ, నీరు త్రాగుతూ, మధ్య మధ్య కులాసాగా యీల వైచుకుంటూ గాఢాంధకారాన్ని చిల్చుకొని ముందుకు సాగిపోతుంది ఎక్స్‌ప్రెస్.

కంపార్టుమెంటులోని ప్రయాణికులు కళ్లు మూస్తూ, తెరుస్తూ మగతనిద్రతో సతతమవుతున్నారు. అప్పుడే నిద్రలేచిన ఓ ప్రయాణికుడు ఆకలిబాధ అణచుకోడానికి గాను టిఫిన్ పొట్లాం విప్పుతున్నాడు. ఏడుస్తున్న పసిపాపనోటికి రొమ్ము అందించి వూరుకో బెడుతుంది ఓ యిల్లాలు.

చిందర వందరగా చిరిగిన వుంగరాల క్రాపు నుదుటి మీదపడి చికాకు కలిగిస్తుంది. అదేపనిగా కిటికీలోనుంచి బయటకు చూడటంవల్ల యింజన్ వదలించే బొగ్గు రవ్వలు కంట్లోపడి కళ్లను ఎర్రపరుస్తున్నాయి. అయినా, యివేమి పట్టించుకొకుండా పిచ్చివానిలా గాఢాంధకారంలో ఏదో జారవిడుకొని దానికోసం వెదుకుతున్నట్లు అదేపనిగా బయటికి చూస్తున్న మధువంక జాలిగాచూస్తున్నాడు శేఖర్ :

మధూ ! జరిగిపోయిన సంఘటనలను తలచుకొంటూ బాధపడేకన్నా, భవిశత్తులో జరగబోయేదాని కోసం పాటుడడం మనవిధి.

మానవుడు, కని, విని ఎరగని అనేక నూతన విశేషాలకోసం తనశక్తినంతా దారబోస్తూ అనుక్షణం ఏదో ఒక నూతన విశేషాన్ని తోటిప్రజానీకానికి అందజేస్తున్నాడు. అయినా యింతవరకూ నిర్జీవులను పునర్జీవులుగా మార్చటమనేది మానవశక్తికి అతీతమైనదిగానే వుండిపోయింది. మానవశక్తికతీతమైన సంఘటన తటస్థపడేటప్పుడు, తోటిమానవులమైన, మనం మాత్రం చేయగలిగేదేముంది ? ఊరుకోమధూ ! అని అదేపనిగా విచారిస్తున్న మధుని వూరడిస్తున్నాడు మిత్రుడు శేఖర్.

శేఖర్ ! ఎవరూ వూహించని సంఘటన, కలలోనైనా తలచనీ సంఘటన అకస్మాత్తుగా ఎదురవుతే, తగిలేషాక్ ఎంతతీవ్రంగా వుంటుందో తెలుసా ? అనుభవపూర్వకంగా తెలుసుకోవలసిందే కాని, ఈ విధంగా వుంటుంది, ఆవిధంగా వుంటుంది అని వూహించుకొంటే ఏంలాభం ?

శేఖర్ ! నాకు తగిలినషాక్, ఏనాటికైనా మర్చిపోగలనా ? బుద్ధిపూర్వకంగా మర్చిపోదామనుకున్నా మరచి పోగలనా ? కళ్ల ఎదుట సజీవంగా నిలుచొని "మధూ, నన్ను మరిచిపోయావా !" అని అనుక్షణమూ పలుకరిస్తుంది వదిన. చిరునవ్వుతో నక్షత్రమండలానికి పయనిస్తున్న, నా 'చిన్నవదిన' నాకుకనిపించడం లేదా ? శేఖర్.

అన్నపెళ్లిలో, పెళ్లిపందిరికింద, పెళ్లిపీటమీద అన్న ప్రక్కన పెళ్లికూతురు హోదాలో, సిగ్గుతో దించినతల ఎత్తకుండా, ఆనందం పరవళ్లు తొక్కుతుంటే, కనీ కనిపించని చిరునవ్వుతో తలవంచుకొని కూర్చున్న మావదిన అదిగో ! ఇది జరిగి పదివసంతాలు పూర్తిగా జరిగిపోయినా, కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్న దాదృశ్యం. ఏలామర్చి పోమంటావో శేఖర్. మాతృమూర్తితో పాటు సగంప్రేమని నా నుండి అపహరించి శాశ్వతంగా నా హృదయంలో స్థానం సంపాదించుకొన్న నా 'చిన్నవదినను' కళ్లారా చూసే అదృష్టం నాకు లేదు.

శేఖర్, నా అంత దురదృష్టవంతుడు మరొకడు వుండడేమో ! కడసారిగా వదినముఖాన్ని కనులారా చూచుకొలేని నిర్భాగ్యుణ్ణి.

మధూ, విద్యావంతుడివై వుండికూడా నీవీ విదంగా ప్రవర్తించడం సబవుకాదు.

అసలు సంగతి నీకుతెలియదు శేఖర్. తెలిసీ తెలియకుండా మాటాడ్డం నీకు సబవేనా? నా 'చిన్నవదిన, మాతృమూర్తితో సమానమైన వదిన సంగతి నీకు పూర్తిగా తెలియదు శేఖర్ ! వదినను తలచుకొంటుంటే వుప్పెనలా పొంగి పొరలుతున్న దుఃఖాన్ని అరికట్టడం నాకు చేతకావడం లేదు. నామాటలు నన్నామాత్రం వూరడించలేవు.

శేఖర్, పది సంవత్సరాల క్రితంనాటిసంఘటనలు నీముందు ఏకరువు పెడతా :

మధూ, నువ్విలా పిచ్చివాడిలా తయారవుతూ నన్ను కూడా పిచ్చివానిగా తయారుచేయాటానికేనా నీచిన్న నాటిసంఘటనలు నెమరువైచు కుంటూ, నాతో చెప్పటం.

అదికాదు శేఖర్ నా కటువంటి ఉద్దేశం లేనేలేదు. నీముందు, విప్పిచెప్పుకుంటే నామనస్సు కొస్త తేలిక బడుతుందనే ఆశతో నా చిన్ననాటి అనుభూతులు నీకు చెప్పదలచుకొన్నాను.

♦ ♦ ♦

మేము నలుగురన్నదమ్ములం. నలుగురివీ నాలుగు రకాల మనస్తత్వాలు, ఒకదానితో మరొకటి పోలికలేని మనస్తత్వాలు మావి. నామనస్తత్వాన్నికాని, నన్నుకాని అర్థం చేసుకోలేక చాలామంది నన్నపార్థం చేసుకుంటారు. బంధువులే నన్నపార్థం చేసుకొంటుంటే యికపై వాళ్లసంగతి వేరేచేప్పనక్కరలే. చిన్నతనంనుంచీ నన్నుసరిగా అర్థంచేసుకొలేకా అనేకమంది అనేక విధాలుగా నన్ను విమర్శించడం మొదలుపెట్టారు. వయస్సు పెరిగినా, యీనాడు కూడా అనేకమంది విమర్శనలకు గురిఅవుతున్నా. అయినా వాళ్ల విమర్శనలకు జడిచి, వాళ్లయిష్టప్రకారం నడచుకొంటూ, నా మనస్తత్వాన్ని మార్చుకోవటం నాశక్తికి మించినపని.

పదమూడు సంవత్సరాల వయస్సులోనున్న నన్ను, నామనస్తత్వాన్ని యితరులలా కాకుండా, చక్కగా, అవలీలగా అర్థంచేసుకొంది వదిన. నన్ను అర్థంచేసుకొనగలిగేవ్యక్తి ఒకరు మాయింటిలో వున్నందుకు ఎంతగానో సంతోషించేను. ఆనాటినుంచి నా ప్రాణాల సయితం వదినకు అర్పించటానికి ఏనాడుకూడా వెనకడుగు వేయలేదు.

త్వరలో అన్నతోపాటు వదినకూడా పట్నంబయలు దేరుతున్నదని తెలిసినాలో నేనే అమితంగా బాధపడ్డాను. నన్నర్థంచేసుకొని, నా మంచి చెడ్డలు సరిగా చూడగల వదినతోపాటు నేనుకూడా పట్నంవెళతానని మారాంచేసాను. చదువుమధ్యలో దెబ్బ తింటుందని ఎంతగానో నచ్చచెప్పి, నన్ను విడచి వెళ్లలేక, వెళ్లలేక పట్నంబయలుదేరింది వదిన.

పట్టుదలతో మావూరిలోని చదువంతా పూర్తిచేసి ఆనందంతో రెక్కలు కట్టుకొని ఎగిరి పడ్డాను వదిన దగ్గర. వయస్సు వయస్సుతోపాటు శరీరర ప్రమాణం పెరిగినా, నేనుమాత్రం పదమూడు సంవత్సరాల మఱిదిగానే కనిపించాను వదినకు.

మనయిద్దరికీ పరిచయంకూడా అదేరోజుల్లో అంటే, కాలేజీలో జాయినయినకొత్త దినాల్లో తటస్తపడినదనుకుంటాను.

అవునున్నట్టుగా తలూపాడు శేఖర్ :

ఎల్లప్పుడు ముఖంమీద చిరునవ్వుతో ఎవరికీ ఏలోటూ రానివ్వకుండా వున్నదాంట్లోనే అందరినీ సంతృప్తి పరిచే వదిన సంరక్షణలో రెండు సంవత్సరాలు రెండు నెలల్లా గడిచిపోయింది. ఆరెండు సంవత్సరాలలోను పట్టుమని పది రోజులుకూడా, వదినను విడచి స్వంత వూరులో గడపలేదు. వదిన పుట్టింటికి ప్రయాణమైతే ఎంతట తిరిగి వస్తుందా అని రోజులులెక్క పెడుతూ వదినకోసం ఎదురు చూస్తుండేవాడిని. అప్పుడప్పుడు వదినతోపాటు నేనుకూడా వాళ్లపుట్టింటికి బయలుదేరి వదినతో తిరిగి వస్తుండేవాడిని.

వదిన మునుపటిలాంటి వదిన కాదు. మాతృమూర్తి స్థానం వహించి యిద్దరి పిల్లలతల్లిగా మారింది. నా నాటికి, నాపై వదినకుండే ప్రేమ పెరగటమేకాని, తరగటం అనేదిలేకుండా పోయింది. నేను "యింటర్" పాసయ్యానని తెలుసుకొని ఎంతగానో మురిసిపోయింది. మా మఱిది యింటర్ పాసయి బి. ఏ. చదవబోతున్నాడని, చుట్టుప్రక్కల వారితోగర్వంగా చెప్పుకు తిరిగేది.

బి.ఏ. లో చేరిన ఆరునెలలకల్లా అన్నయ్యకి కలకత్తా బదిలీఅయినట్లు తెలిసింది. ఎవరికెలావున్నా నాకుమాత్రం యీ వార్తిసంతోషానికి బదులు విచారాన్ని కలిగించింది. తిరిగి వదినను విడచి వుండవలసిన పరిస్తితి ఏర్పడినందుకు నాలోనేనే బాదపడ్డాను. చీటికీమాటీకీ చూడటం

అనేది వీలులేకుండా అయిదు వందలమైళ్ల దూరం వెళ్లి పోతుంది వదిన.

"వదిన, నీవులేకుండా వంటరిపాటుగా నేనెలా పుండగలను ?"

నాప్రశ్నకి సమాధానంగా యింకెంతకాలం మధూ, బి. ఏ. పాసయిన వెంటనే ఉద్యోగందొరుకుతుంది. ఉద్యోగం దొరికినవెంటనే 'నాతోడి కోడలు' వచ్చేస్తుందిలే మరేం బెంగపెట్టుకొకు, అంది చిరునవ్వుతో.

ఆలా పరాచికాని కందే కాని తను ట్రైను ఎక్కేముందు నన్నువిడిచివెళ్తున్నందుకు ఎంతబాధ పడిందా వదినముఖమె చెప్పింది. శేఖర్ ! ఆనాటి వదినముఖాన్ని ఏలా మరిచిపోమంటావుచెప్పు ?

మునుపు అన్నయ్య, వదిన, పిల్లలతో కళకళలాడు తుండేయిల్లు నలుగురు స్టూడెంట్సుతో నిండింది. వదిన చేతుల్తో స్వయంగా వండి, వడ్డించె, రుచికరమైనభోజనానికిబదులు అయ్యరుపెట్టిన హోటలుభోజనం అమలులో కొచ్చింది. ఆ వయస్సులో స్టూడెంట్సుతో కలసిమెలసి వుండటంవల్ల కలిగే ఆనంధాన్ని అనుభవించేశక్తిలేక వదినను- అన్నను, పిల్లలను తలచుకుంటూ రోజులు బరువుగా దొర్లిస్తుండే వాడిని.

సిగరెట్లు కాల్చటంకూడా యీరోజుల్లో ఒక 'క్వాలిఫికేషనని' రూంమెట్సు బలవంతంచేయగా సిగరెట్లు రుచి మొదలుపెట్టాను. పండక్కి వచ్చిన వదినకు, యీ సంగతి తెలిసిఎంతగానో ఖాదపడి చనువుగా మందలించింది. వదినమాటపై సిగరెట్లు మానడానికి విశ్వప్రయత్నంచేసి పరాజయాన్ని పొందాను.

బి. ఏ. పూర్తయి రెండు సంవత్సరాలయినా సరయిన ఉద్యోగం దొరక్క యీనాటివరకు నిరుద్యోగిగావున్న సంగతి నీకు తెలిసినదే కదూ ?

మధు చెప్పతున్నదంతా శ్రద్ధగా ఆలకిస్తున్న శేఖర్ తెలుసునన్నట్లుగా తలవూపి, తనోసిగరెట్టు వెలిగించి మరోటి మధు కందించేడు.

సిగరెట్ పొగవదలుచూ చిన్నచిన్న ఉద్యోగాలు దొరికినా యిష్టంలేక వాటినివిడనాడినందుకు బందువులందరూ తలోమాట అన్నారు. అంతేకాని దొరికిన ఉద్యోగాల యొక్క మంచిచెడ్డలు ఎవరూ గుర్తించలేదు.

బి. ఏ. పాసయి, యింతవరకూ నిరుద్యోగిగావున్న నన్నుచూచి విచారించి, ధైర్యంచెప్పుతూ సానుభూతి చూపించేది వదిన. నాకు ఎంతట ఉద్యోగం దొరుకుతుందా అన్నఆశతో, ఆ శుభదినంకోసం ఎదురు చూస్తుండేది.

ముగ్గురు పిల్లలకి మాతృత్వంవహించిన వదిన నాలుగవకాన్పుకు పుట్టింటికి ప్రయాణమయింది. అలవాటు ప్రకారం జేబులోంచి అర్ధరూపాయి తీసి టాస్ వేసాను ఆడో, మొగో, ముందే తెలుసుకోవాలని, టాస్ వేసిన అర్ధరూపాయి ఎక్కడ పడిందోకాని తిరిగి కనిపించలేదు, ఆలా అర్ధరూపాయి దొరకకుండా పోవడం అశుభమని కలలోకూడా తలచలేదు.

వదిన పుట్టింటి దగ్గరనుంచి వచ్చేశుభవార్తకోసం, వదినరాకకోసం ఎదురు చూస్తుంటే ఒకనాడు శుభవార్తకు బదులు....................

ఏనాడు శుభవార్త వస్తుందో ఆనాడు యింట్లో విందుచెసుకుందానుని ఎదురుచూస్తున్న మమ్మల నందర్ని కన్నీటి కాల్వులతో నింపింది, ఆటెలిగ్రాం.

కన్నీరు తుడుచుకుంటూ యిప్పుడు చెప్పు శేఖర్, నా వదినను అందరికన్నా అత్యధికంగా మాతృమూర్తి ప్రేమతో సమానంగా ప్రేమించిన నా వదినను ఏలా మర్చిపోగలను ? అంతటిశక్తినాలో వుందా ? నా ఉద్యోగాన్ని కాని, నావివాహాన్ని కాని, కనులార చూడకుండా తన కోరికలను, తనలోనే యిముడ్చికొని అనంత వాయువులో లీనమైన వదినను ఎలా మర్చిపోను.

చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకొంటూ దూరాన్నవున్న రాజమండ్రి స్టేషనుచూచి, మధూ, అప్పుడే రాజమండ్రి వచ్చేసాం, అన్నాడు శేఖర్.

మిత్రులిద్దరితోపాటు మరికొంత మంది ప్రయాణీకులను దింపి, క్రొత్త ప్రయాణీకులను ఎక్కించుకొని మందగమనముతో ప్లాట్ఫారాన్ని విడిచిపెడుతుంది ఎక్స్ప్రెస్.

ప్రశాంతంగా పారుచున్న గోదావరిలో వదిన అస్తికలతోపాటు రెండు అశ్రుకణాల్ని జారవిడచి మనస్ఫూర్తిగా నమస్కరించాడు. గోదావరి మహాతల్లి ఆ రెండింటిని తనలో యిముడ్చుకొని మామూలుగా ముందుకు సాగిపోతుంది. అస్తికలుపోతున్న దిక్కువేపే చూస్తూ.దిగులుగానిలచున్న మధుని బలవంతంగా పైకి తీసుకొచ్చాడు శేఖర్.